# వార్ వన్‌సైడే.!



ఎమ్మెల్యే కృష్ణారావుకు మద్దతు తెలుపుతున్న బాలాజీనగర్ రెడ్డి కుటుంబాల సభ్యులు

- టికెట్ రాని ఆశావహులతో హస్తం, కమలం పాట్లు
- అంతర్గత పంచాయితీల పరిష్కారానికే సమయం వృథా
- గ్రేటర్ నియోజకవర్గాల్లో గులాబీ జోరు
- కాంగ్రెస్, బీజేపీల ప్రచారానికి స్పందన కరువు

సిటీబ్యూరో, నవంబర్ 14 ( నమస్తే తెలంగాణ ) : కమలం, హస్తం పార్టీల్లో టికెట్ రాని నాయకులతో ఆ పార్టీ అభ్యర్థులకు తలనొప్పి ఎదురవుతోంది. పార్టీలో ఏండ్ల నుంచి కష్టపడ్డవారిని కాదని ప్యారాచూట్ నేతలకు టికెట్లు ఇవ్వడంపై ఆశావహులు ఆది నుంచి వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. ఈ పరిస్థితుల్లో తమకు రాకుండా టికెట్ తన్నుకుపోయిన వారిపై ఆ పార్టీ నేతలు మౌన యుద్ధం చేస్తున్నారు. పార్టీ ప్రచార కార్యక్రమాల్లో పాల్గొనకపోవడం, పార్టీ గెలుపు కోసం పనిచేయకపోవడం లాంటివి చేస్తున్నారు. అంబర్‌పేట్, సికింద్రాబాద్, కంటోన్మెంట్‌లో పార్టీలో పనిచేస్తున్న వారిని కాదని బీజేపీ ప్యారాచూట్ నాయకులకు టికెట్ కేటాయించింది. దీంతో ఆ నియోజకవర్గాల్లో బీజేపీ నాయకుల మధ్య ఐక్యత కరువై ఎవరికి వారే యమునా తీరుగా వ్యవహరిస్తున్నారని పార్టీ వర్గాలు చర్చించుకుంటున్నాయి. గ్రేటర్‌లో బీజేపీ, కాంగ్రెస్ పరిస్థితి చాలా నియోజకవర్గాల్లో ఇలానే ఉంది. సొంత పార్టీ నాయకులే తమ అభ్యర్థులు బరిలో ఉండేందుకు అంగీకరించడం లేదు. ఇలాంటి వ్యతిరేక పరిస్థితుల్లో ప్రతిపక్షాలకు కనీసం డిపాజిట్లు కూడా వచ్చే పరిస్థితి లేదని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. మరోవైపు బీఆర్‌ఎస్ పార్టీ గెలుపు లక్ష్యంగా ప్రచారంలో జోరు పెంచింది. హ్యాట్రిక్ విక్టరీయే లక్ష్యంగా అభ్యర్థులు, నాయకులు, కార్యకర్తలు ప్రతీ ఇంటికి వెళ్లి ప్రచారం చేస్తున్నారు. ప్రజల నుంచి విశేష స్పందన వస్తున్నది. తొమ్మిదిన్నరేండ్లలో జరిగిన అభివృద్ధికే తమ ఓటు అని ప్రజలు నినదిస్తున్నారు. క్షేత్రస్థాయిలో బీఆర్‌ఎస్ దూకుడు సాగుతుంటే కాంగ్రెస్, బీజేపీలు మాత్రం అంతర్గత ఘర్షణలతో నాయకుల మధ్య పంచాయితీలను పరిష్కరించడానికే సమయం సరిపోతుందని ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి.

## ఎమ్మెల్యే కృష్ణారావుకు రెడ్డి కుటుంబాల మద్దతు

కేపీహెచ్‌బీ కాలనీ, నవంబర్ 14 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావుకు బాలాజీనగర్ కాలనీకి చెందిన 500 రెడ్డి కుటుంబాలు సంపూర్ణ మద్దతును తెలిపాయి. మంగళవారం బాలాజీనగర్ రెడ్డి కుటుంబాల ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే కృష్ణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కూకట్‌పల్లిలో ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ స్థానికేతరులు వచ్చి బరిలో నిలవడం.. ఎన్నికలు కాగానే కనిపించకుండా పోవడం జరుగుతుందన్నారు. నిత్యం ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజాసేవ చేసిన తనను మరోసారి ఆశీర్వదించాలని కోరారు. మద్దతు తెలిపిన రెడ్డి కుటుంబాలకు ఎల్లవేళలా అండగా ఉంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ బాబూరావు, డివిజన్ అధ్యక్షుడు ప్రభాకర్‌గౌడ్, రెడ్డి సంఘం నేతలు ఉన్నారు.

# అభివృద్ధి చేశాం.. ఆదరించండి

మంత్రి చామకూర మల్లారెడ్డి

- కాంగ్రెస్‌కు ఓటేస్తే రాష్ట్రం చీకటే..



మేడ్చల్‌లో ప్రచారం చేస్తున్న కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి

మేడ్చల్, నవంబర్ 14 : నియోజకవర్గాన్ని ఎంతో అభివృద్ధి చేశా...ఈ ఎన్నికల్లో ఆదరించాలని..మరింత అభివృద్ధి చేస్తానని మేడ్చల్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, కార్మిక శాఖ మంత్రి చామకూర మల్లారెడ్డి అన్నారు. మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో మంగళవారం మంత్రి పర్యటించి, ఎన్నికల ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నిర్వహించిన కార్నర్ మీటింగ్‌లో ప్రజలనుద్దేశించి మాట్లాడారు. నాలుగున్నరేండ్లలో రోడ్లు, తాగునీరు, కరెంట్, పార్కుల ఏర్పాటు, జిల్లా గ్రంథాలయ సంస్థ భవనం తదితర ఎన్నో అభివృద్ధి పనులు చేశామన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలు పరిష్కరించామని, సీఎం కేసీఆర్ ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని తెలిపారు. బీఆర్‌ఎస్ అధికారంలోకి రాగానే పింఛన్లు దశలవారీగా రూ.5వేలు పెంచుతామని, రూ. 5 లక్షల బీమా, ఆరోగ్య బీమా రూ.15 లక్షలు, రూ. 400కే గ్యాస్ సిలిండర్‌ను అందజేస్తామన్నారు. సీఎం కేసీఆర్ ఇచ్చిన మాట తప్పరని, మ్యానిఫెస్టోలో ఇచ్చిన ప్రతి హామీని అమలు చేస్తామని చెప్పారు. కాంగ్రెస్‌కే ఓటేస్తే రాష్ట్రంలో చీకట్లే మిగులుతాయని, పథకాలు బంద్ అవుతాయన్నారు. అభివృద్ధి కావాలా? వినాశనం కావాలా ప్రజలే తేల్చుకోవాలని సూచించారు. తనను గెలిపిస్తే భవిష్యత్‌లో మరిన్ని అభివృద్ధి పనులు చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీ చైర్‌పర్సన్ మర్రి దీపికానర్సింహా రెడ్డి, వైస్ చైర్మన్ రమేశ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ సభ్యులు, బీఆర్‌ఎస్ మున్సిపాలిటీ అధ్యక్షుడు శేఖర్ గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ భాస్కర్ యాదవ్, నాయకులు నర్సింహా రెడ్డి, విష్ణుచారి పాల్గొన్నారు.

# కర్ణాటకలో గ్యారంటీలు అబద్ధమే..

- పక్క రాష్ట్రంలో హామీలు అమలు చేయనోళ్లు... ఇక్కడేం చేస్తారు
- పది వేల మంది రైతులు ధర్నాకు సిద్ధమవుతున్నరు
- ఎమ్మెల్యే దానం నాగేందర్

ప్రచారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దానం



ఖైరతాబాద్, నవంబర్ 14 : కర్ణాటకలో కాంగ్రెస్ గ్యారంటీలు అబద్ధాలని తేలిపోయాయని ఖైరతాబాద్ బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే దానం నాగేందర్ అన్నారు. ఖైరతాబాద్‌లోని పలు బస్తీల్లో పాదయాత్ర నిర్వహించి స్థానికులను ఓట్లు అభ్యర్థించారు. ఈ సందర్భంగా దానం నాగేందర్ మాట్లాడుతూ... తొమ్మిదిన్నరేండ్లలో రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందిందన్నారు. కర్ణాటక రాష్ట్రం పరిస్థితి దయనీయంగా ఉందని, అక్కడ ఒక్క గ్యారంటీ కూడా కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేకపోతున్నదని స్వయంగా మాజీ సీఎం కుమారస్వామి చెప్పారని గుర్తు చేశారు. ఆ రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ అక్కడి రైతులు పది వేల మందితో ధర్నా చేసేందుకు సమాయత్తమవుతున్నారని, అక్కడే ఏం చేయనోళ్లు ఇక్కడ ఏదో చేస్తామని ప్రగల్భాలు పలుకుతున్నారని విమర్శించారు. ఇటీవల కర్ణాటక సీఎం వచ్చి బీసీ డిక్లరేషన్ అన్నారని, ఇంకో మంత్రి వచ్చి మైనార్టీ డిక్లరేషన్ అంటున్నారని.. అసలు ఆ పార్టీ అధికారంలో ఉన్న ఏ రాష్ట్రంలోనూ అమలు కావడం లేదన్నారు. ఇక అభివృద్ధి ఊసే లేదని ఎద్దేవా చేశారు. ఇక్కడి ప్రజలకు మోసపూరిత వాగ్దానాలు ఇచ్చి ఓట్లు దండుకోవాలని కుట్రలు చేస్తున్నారని, తెలంగాణ ప్రజలు రాజకీయ చైతన్యం ఉన్నవారన్నారు. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, బీజేపీలకు ప్రజలు గుణపాఠం చెప్పాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మహేందర్ బాబు, మహేశ్ యాదవ్, ప్రవీణ్ పాల్గొన్నారు.

# ప్రజా సంక్షేమానికి కృషి

అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి



ఆత్మీయ సమావేశంలో మాట్లాడుతున్న మల్కాజిగిరి బీఆర్‌ఎస్ అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి

మల్కాజిగిరి, నవంబర్ 14: ప్రజల సంక్షేమం కోసం బీఆర్‌ఎస్ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తున్నదని మల్కాజిగిరి బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి మర్రి రాజశేఖర్ రెడ్డి అన్నారు. మంగళవారం అల్వాల్ డివిజన్‌లో కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఆత్మీయ సమావేశంలో మర్రి రాజశేఖర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. ప్రచారంలో నాయకులు, కార్యకర్తలు మ్యానిఫెస్టోలోని ప్రతి అంశాన్ని ప్రజలకు వివరించాలన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను గెలిచిన తర్వాత అమలు చేస్తామని, పేదలు ఆర్థికంగా ఎదగడానికి బీఆర్‌ఎస్ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదన్నారు. ఇండ్లు లేనివారికి డబుల్ బెడ్ రూమ్, ఇంటి స్థలం ఉంటే రూ.5లక్షల ఆర్థిక సహాయం చేస్తామన్నారు. రేషన్ కార్డులు ఉన్న వారికి నెలనెలా సన్న బియ్యం, రూ.400కే సిలిండర్ అందజేస్తామన్నారు. కుటుంబానికి రూ.5లక్షల బీమా సౌకర్యం, ఆరోగ్య రక్ష పథకం అందజేయనున్నట్లు తెలిపారు. విడతల వారీగా పెన్షన్‌లు పెంచుతామన్నారు. రానున్న ఎన్నికల్లో ప్రజలు కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్‌ఎస్ పార్టీని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు శాంతిశ్రీనివాస్ రెడ్డి, చింతల శ్రీనివాస్ రెడ్డి, పరమేశ్, శ్రీనివాస్ గౌడ్, నిర్మల రెడ్డి, విద్య తదితరులు పాల్గొన్నారు.

# సంక్షేమం, అభివృద్ధికే ఓటేయండి

బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి



మహిళా ఓటర్‌ను ఓటు అభ్యర్థిస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి తదితరులు

చర్లపల్లి, నవంబర్ 14 : నియోజకవర్గంలో అమలు చేసిన సంక్షేమ పథకాలు, చేసిన అభివృద్ధిని చూసి ఓటేయాలని ఉప్పల్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ప్రజలను కోరారు. ఏఎస్‌రావునగర్ డివిజన్ పరిధిలోని నార్త్ కమలానగర్, టీఎస్‌ఐఐసీ కాలనీ, భవానీనగర్ తదితర ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ రాష్ట్ర కార్యదర్శి తాడూరి శ్రీనివాస్, మాజీ కార్పొరేటర్లు కొత్త రామారావు, పజ్జూరి పావనీమణిపాల్‌రెడ్డితో కలిసి అభ్యర్థి బండారి లక్ష్మారెడ్డి ఇంటింటి ప్రచారం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... నియోజకవర్గ పరిధిలో అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేసిన బీఆర్‌ఎస్‌ను అత్యధిక మెజారిటీతో గెలిపించాలన్నారు. ఉప్పల్ నియోజకవర్గాన్ని సీఎం కేసీఆర్ అన్ని రంగాల్లో అభివృద్ధి చేశారని, భవిష్యత్తులో మరింత అభివృద్ధి చేసేందుకు తనను గెలిపించాలని సూచించారు. ప్రజా సమస్యలను విస్మరించి ప్రజలను మోసం చేసేందుకు వస్తున్న కాంగ్రెస్, బీజేపీ నాయకుల మాటలు నమ్మి మోసపోవద్దన్నారు. ఈ కార్యకమంలో ఏఎస్‌రావునగర్ బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు కాసం మహిపాల్‌రెడ్డి, కుమార్‌స్వామి, నాయకులు బాల్‌రాజు, మురళీపంతులు, సుదర్శన్‌రెడ్డి, రహీం, సురేందర్‌రావు, శ్రీనివాస్, యాకయ్య, మొగులయ్య, రమాదేవి, రామతులసీ, దుర్గా, శంకర్, రాములు, గిరి, కాలనీవాసులు పాల్గొన్నారు.

# శేరిలింగంపల్లిలో బీఆర్‌ఎస్ జెండా ఎగిరేస్తాం

బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ

మాదాపూర్, నవంబర్ 14 : కండ్ల ముందు జరిగిన అభివృద్ధిని చూసి ప్రజలు అభివృద్ధికి పట్టం గట్టాలని, మూడోసారి అత్యధిక మెజార్టీతో ఆశీర్వదించి గెలిపించాలని స్థానిక బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, విప్ అరెకపూడి గాంధీ అన్నారు. మాదాపూర్ డివిజన్ పరిధిలో ప్రచారంలో భాగంగా మంగళవారం అరెకపూడి గాంధీ గోకుల్ ప్లాట్స్‌లోని 40 ఫీట్ రోడ్డు హనుమాన్ టెంపుల్ నుంచి బీఆర్‌ఎస్ శ్రేణులతో కలిసి మాతృశ్రీ నగర్, రాజారామ్ కాలనీలో పర్యటించి కాలనీల్లో, బస్తీల్లో ఇంటింటి ప్రచారం చేశారు. బీఆర్‌ఎస్ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... సీఎం కేసీఆర్ రాష్ట్రంలోని పేదలకు అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారని, ప్రభుత్వ సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్ పార్టీ గెలుపునకు శ్రీరామ రక్ష అని అన్నారు. కాలనీలు, బస్తీల్లో రోడ్లు, మంచి నీటి సమస్యలను పూర్తి స్థాయిలో పరిష్కరించామని తెలిపారు. మ్యానిఫెస్టో అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతికి దోహదపడేలా ఉందని చెప్పారు. రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి అరెకపూడి గాంధీ